

19 వ వసంతంలోకి ...

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

గురువారం,29 జనవరి 2026

8 పేజీలు


# ప్రాణాలకు రక్షణ కవచం హెల్మెట్

**- హెల్మెట్ ,సీట్ బెల్ట్ పెట్టుకోని వారిపై చట్టరీత్యా చర్యలు**

**- శాసన ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ నాగరాణి**





**భీమవరం,మేజర్‌న్యూస్ :** హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా వాహనాలను నడిపే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని జరిమానాలు విధించాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. జాతీయ భద్రత మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్ శాఖల ఆధ్వర్యంలో బుధవారం జువ్వలపాలెం రోడ్డు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ పెరేడ్‌గ్రౌండ్‌వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీలో రాష్ట్ర ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు,జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లాఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి,స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు,జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈర్యాలీలో జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి స్వయంగా బైక్ నడిపి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.వీరితో పాటు వివిధశాఖల జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు, పట్టణలోని డాక్టర్లు, లాయర్లు,జొమోటో, సిగ్గి ఫుడ్ డెలివరీ బాయ్స్, తదితరులు జువ్వలపాలెం రోడ్డుఅల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్టు పెట్టుకోకుండా వాహనములు నడిపే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని జరిమానాలు విధించాలని అన్నారు. జనవరి

- తరువాయి 2లో..

# ఉగాది నాటికి గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలి

**- నిర్లక్ష్యం వహించే అధికారులు,ఇంజనీరింగ్ సిబ్బందిపై చర్యలు**

**- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరిక**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ఉగాది నాటికి 5లక్షల నిరుపేదలకు ఇళ్ళు అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం జిల్లాలో పేదల గృహనిర్మాణాల లక్ష్యాలపై గృహ నిర్మాణశాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉగాది నాటికి రాష్ట్రంలోని 5లక్షల నిరుపేదలకు స్వంత ఇల్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో ఉగాది నాటికి 15 వేల 521గృహాలు నిర్మించి ఇవ్వాలని లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందన్నారు. లక్ష్యాల సాధనకు అనుగుణంగా అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ఇళ్లనిర్మాణ ప్రగతిపై ప్రతీ వారం సమీక్షిస్తానని, లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహించే అధికారులు,ఇంజనీరింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.సత్యనారాయణ,జెడ్పి సీఈఓ శ్రీహరి, గృహనిర్మాణశాఖ ఈఈలు,డిఈలు,ఏఈలు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమినిటీ సెక్రటరీలు, పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే రాధాకృష్ణ భేటీ



**తణుకు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా భేటీఅయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసినఆయన తణుకు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, ఎండీఫరూఖ్, సబిత, డొల్ల వీరాంజనేయులు, అనగాన సత్యప్రసాద్, నారాయణ, సత్యకుమార్‌లను కలిసి ఆయాశాఖలకు సంబంధించి తణుకు నియోజకవర్గానికి అవసరమైన నిధులు, తదితర అంశాలపై చర్చించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతి పత్రాలను అందజేసినట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

# చింతలపూడి కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ చోరీ కేసు చేధించిన పోలీసులు

**- రూ.7 కోట్లు విలువైన 4.49కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం**

**- నిందితుడి అరెస్ట్ : ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** చింతలపూడి పట్టణంలోని కనకదుర్గ గోల్డ్‌ఫైనాన్స్‌లో ఏడాది సెప్టెంబర్ 9వతేదీన జరిగిన బంగారం అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడైన ఆడిటర్ను అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.7 కోట్ల 50లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆరోజు ఉదయం 11గంటల సమయంలో ఆడిట్ నిమిత్తం హెడ్ ఆఫీసు నుండి వచ్చిన ఆడిటర్ వడ్లమూడి ఉమా మహేశ్ నిబంధనలకు విరుద్ధంగా లాకర్లలోని మొత్తం బంగారాన్ని బయటపెట్టి ఆడిట్ నిర్వహించాడు.సాయంత్రం సమయంలో బ్రాంచ్ మేనేజర్ బయటకు వెళ్లిన అవకాశాన్ని ఉపయోగించుకుని, క్యాషియర్‌ను కొబ్బరి నీళ్లు తెమ్మని బయటకు పంపి, ముందుగా తెచ్చుకున్న బ్యాగ్‌లో 378 కవర్లలో ఉన్న 4.490 కిలోల బంగారు ఆభరణాలు (సుమారు రూ. 7కోట్ల విలువ) వేసుకుని పారిపోయాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏలూరు జిల్లా ఎస్పీ కె.పి.ఎస్. కిషోర్ పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెం ఏఎస్పీ ఆర్.సుస్మిత,ఇంచార్జ్ డీఎస్పీ యు.రవి చంద్ర ఆధ్వర్యంలోచింతలపూడి సర్కిల్ పోలీసులు, జిల్లా సైబర్ సెల్,ఐటీ కోర్ సహకారంతో విస్తృత దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా నిందితుడైనపై 38 సంవత్సరాల వయస్సు గల వడ్లమూడి ఉమా మహేశ్‌నివాసం నాయుడుపేట, నెల్లూరు జిల్లా అనే వ్యక్తిని బుధవారంబుధవారం

- తరువాయి 2లో..

# మాధవాయిపాలెం ఫెర్రీని పరిశీలించిన ఐజి అశోక్ కుమార్



**నరసాపురం,మేజర్‌న్యూస్:** అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు ప్రారంభమైన సందర్భంగా నర్సాపురం నుండి వశిష్ట గోదావరి దాటి తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి వెళ్లే మాధవాయిపాలెం పెర్రిని ఐజి అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు.రేవునుండి ఉత్సవానికి హాజరయ్యే భక్తులు వేలసంఖ్యలోపండుపై ప్రయాణం చేసి రేవు దాటుతారు. రాత్రి సమయంలో కూడా పంటు ద్వారా రాకపోకలు కొనసాగించవచ్చని జిల్లా ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఐజి అశోక్ కుమార్ ఈప్రాంతాన్ని సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.ఏఎస్‌పి రామారావు,డీఎస్పీశ్రీవేద,ఇతరపోలీసుఅధికారులు పాల్గొన్నారు.

# ఎల్బీచర్ల సొసైటీ మాజీ అధ్యక్షులు సర్వేశ్వరరావు మృతి





- ప్రముఖుల నివాళులు

**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని ఎల్బీ చర్ల మాజీ సొసైటీ అధ్యక్షులు మాజీ డీసీసీబీ డైరెక్టర్ చీర్ల సర్వేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు.

బుధవారం ఎల్బీచర్లలో ఆయన భౌతిక కాయానికి మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు,మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, డీసీసీబీ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ సర్వేశ్వరరావు మృతదేహంపై పూల మాలలు వేసి నివాళు లర్పించారు. సుమారు 30 ఏళ్ల పాటు ఎల్బీచర్ల సహకార సంఘానికి ఆయన అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులు రైతులకు సర్వేశ్వరరావు చేసిన సేవలను గుర్తుతెచ్చుకున్నారు. ఎల్బీచర్ల సహకార సంఘం సిబ్బంది సర్వేశ్వరరావు మృతి పట్ల సీఈఓ కోయ ఏసుప్రభు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నివాళులర్పించారు. ఎల్ బి చర్ల సహకార సంఘం చైర్మన్ గుబ్బల వీరాస్వామి, లక్ష్మణేశ్వరం, కొప్పర్రు, మల్లవరం సొసైటీల చైర్మన్లు చాగంటి పార్ధసారధి, అందే నరేన్, సంధి నరసింహారావు నివాళులర్పించారు.

# 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**– జిల్లాలో 2,24,521 మంది లబ్ధిదారులకు ప్రయోజనం**



**భీమవరం,మేజర్ న్యూస్ :**ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి ఒకటికి బదులుగా ఒక్కరోజు ముందుగానే జనవరి 31న పింఛన్లను అందజేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 1 ఆదివారం వచ్చినందున పెన్షన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు.

దీనికి సంబంధించిన డబ్బులు బ్యాంకు నుండి విత్ డ్రా, తదితర పనులను జనవరి 30 నాటికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,24,521 మందికి సామాజిక పింఛన్లను సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికి స్వయంగా వెళ్లి పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు.పింఛన్లు పంపిణీ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, గౌరవంగా పింఛన్లను అందించాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఏమైనా సమస్య ఉంటే వెంటనే జిల్లా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ దృష్టి తీసుకురావాలని తెలిపారు.

# ఎన్.టి.పి.సి. విశ్రాంత ఉద్యోగుల ఐ క్యాంప్ నిర్వహణ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎన్.టి.పి.సి. విశ్రాంతి ఉద్యోగులు స్థానిక రేచర్లపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మొండి రవికుమార్, గౌరవ అతిథిగా కార్యదర్శి అలీమ్ పాల్గొన్నారు. సిరి ఆప్టికల్స్ అధినేత ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 154 మందికి కంటి దోషాలను గుర్తించి వారి అందరికీ లక్ష యాభై వేల రూపాయలు విలువచేసే అత్యాధునిక కళ్ళజోళ్లను అందజేశారు.

ఎన్టిపిసి విశ్రాంతి ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కె.వి.బి. ఆచారి మాట్లాడుతూ ఎస్.భావరాజు సలహాలతో 16వ సేవా కార్యక్రమంలో భాగంగా తమ మిత్రులు సహకారంతోఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విశ్రాంత ఉద్యోగులందరూ ఎప్పటికప్పుడు సేవాకార్యక్రమాలనిర్వహణకు ఆలోచన చేయడమే కాకవాటి అమలుకు కూడాకార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటున్నామని చెప్పారు. నిజమైన లబ్ధిదారులకు, పేదలకు తమ సేవలు సద్వినియోగం అవ్వాలన్న భావనతో మరియు తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఇప్పటికి వరకు 15కు పైగా సేవా కార్యక్రమాలు వృద్ధాశ్రమాలు, అనాథ బాలబాలికల పాఠశాలలోనూ, కళాశాలలోనూ, ఆర్ఫనేజ్ లోను, వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సంస్థలలోనూ చేట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయని చెప్పారు. లబ్ధిదారులందరూ ఎంతో ఆనందంగా తమ సేవలను స్వీకరించడమే కాక కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తూ ఫోన్లు చేయడం మా సేవలకు సార్ధకత ఏర్పడిందన్న భావనను కె.వి.బి. ఆచారి వ్యక్తం చేశారు.ముఖ్య అతిథి డాక్టర్ మొండి రవికుమార్ మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శేష జీవితంలోను సమాజంలో ఎంతో ఆనందాన్ని పంచుతూ మరియు ఆనందాన్ని పొందుతున్న ఇటువంటి విశ్రాంత ఉద్యోగులు ఎందరికో మార్గదర్శకులు మరియు స్ఫూర్తి ప్రదాతలని రవికుమార్ కొనియాడారు. కంటి పరీక్షలు నిర్వహణలో ఎంతో సహకారం అందించిన సిరి ఆప్టికల్స్ అధినేత ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఉపకరణాలు అందజేత





**ఉంగుటూరు,మేజర్ న్యూస్ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఉంగుటూరు ఎంపీడీవో మనోజ్ అన్నారు. బుధవారం ఉంగుటూరు హైస్కూల్లో పదో తరగతికి విద్యార్థులు 94 మందికి పరీక్షా ఉపకరణాలు ఆర్నవ్ గ్రూప్స్ అధినేత మనోజ్ కుమార్ సొంకర్ ఉచితంగా అందజేసారు. పది పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్తుకు స్ఫూర్తిని కలిగించే ఉద్దేశ్యంతో ఈ ఉపకరణాలు అందజేసినట్లు ఆర్నవ్ గ్రూప్స్ అధినేత మనోజ్ కుమార్ సొంకర్ అన్నారు.విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు రాయడానికి ఉపయోగించే పరికరాలను పాడ్,పెన్స్, పెన్సిల్, ఎరేజర్, స్కేల్ అందజేశారు. మండలంలో అన్ని హైస్కూల్‌కు ఇస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బండారు సింధు మధుబాబు, ప్రధానోపాధ్యాయులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలకు రక్షణ కవచం హెల్మెట్

మొదటిపేజి తరువాయి

మాసం అంతా సడక్ సురక్ష జీవన రక్షపేరుతోరోడ్ సేఫ్టీ లైఫ్ సేఫ్టీ కార్యక్రమాలను నిర్వహించు కోవడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈరోజు అధికారికంగా జువ్వలపాలెం రోడ్డు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున నిర్వహించిన అవగాహన బైక్ ర్యాలీలో పాల్గొనటం జరిగిందని అన్నారు.చాలామంది హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారన్నారు. హెల్మెట్‌తో పాటుసీటుబెల్టు ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. ఎవరయితే రూల్స్ ను అతిక్రమిస్తారో వారిపై చర్యలతో పాటు పెనాల్టీ విధించాలని పోలీస్ శాఖకు సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ బైకు నడపటం అరికట్టాలన్నారు. పెనాల్టీ అంటే డబ్బులు వసూలు చేయటం అని కాకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వాహన చోధకులు నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలతో కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని రహదారుల భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రహదారి ప్రమాదాల కారణంగా ప్రతి సంవత్సరం అనేకమంది అమాయకులు ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఈ ప్రమాదాలను నివారించాలంటే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ను వినియోగించి వారి గమ్యాన్ని క్షేమంగా చేరుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ప్రతి పౌరుడి బాధ్యత కీలకము అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అప్పుడే ప్రమాదాలు తగ్గించగలుగుతామని అన్నారు. శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపటం చాలా ప్రమాదకరమని అన్నారు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి. శివన్నారాయణ రెడ్డి, జిల్లా రోడ్డు భద్రత శాఖ అధికారి కృష్ణారావు,ఆర్టీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ రఘువీర్, మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రారెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొటికలపూడి గోవిందరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పట్టణంలో డాక్టర్లు, లాయర్లు, ఫుడ్ డెలివరీ పార్ట్నర్స్, తదితరులు పాల్గొన్నారు.

## చింతలపూడి కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ చోరీ కేసు చేధించిన పోలీసులు

మొదటిపేజి తరువాయి

అరెస్టు చేసి చోరీకి గురైన మొత్తం బంగారాన్ని పూర్తిగా రికవరీ చేశారు.స్వాధీనం చేసుకున్న వస్తువులు: 4.484 కిలోల బంగారు ఆభరణాలు (రూ.7 కోట్ల విలువ), మొబైల్ ఫోన్, పచ్చరంగు షోల్డర్ బ్యాగ్ ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

### పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

**చింతూరు,మేజర్‌న్యూస్ :** చింతూరు మండలంలోని పెద్దశితనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం రైతు సేవా కేంద్రంలో ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పంచాయతీ పరిధిలో పశు సంవర్ధకశాఖ యు.అనిల్ కుమార్ మరియు ఎన్.ప్రవీణ్ చీడుమూరు ఆర్.ఎస్.కె. క్యాంపు నిర్వహించి పశువులకు నత్తల మందు పట్టించడం జరిగినది.

మేకలకి, గొర్రెలకి, ఆవులకి, గేదెలకి వాక్సినేషన్ మరియు పశు గ్రాసం మరియు పశువులకు ఇన్సూరెన్స్ చేయించాలని గ్రామస్థులకి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తీగల రవి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కారం దుర్గారావు, గ్రామస్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థుల వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీసిన విజ్ఞాన ప్రదర్శన

**రాజమండ్రి,మేజర్‌న్యూస్:** స్థానిక దానవాయిపేటలోని ఆక్స్ఫర్డ్ ఒలం పియాడ్ పాఠశాలలో పాఠశాల స్థాయి విజ్ఞాన ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల విద్యార్థులు ఈ ప్రదర్శనలో అనేక వినూత్న వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు.

# బాల్య వివాహాలపై అంగనవాడి టీచర్లకు అవగాహన






**ఏలూరు,మేజర్ న్యూస్:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం వంద రోజులపాటు బాల్య వివాహాల నిర్మూలనకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం నందు ఏలూరు మండల పరిధిలోని అంగనవాడి టీచర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధిత అధికారులకు ,పౌరులకు ఎప్పటికప్పటికీ అవగాహన సదస్సులను నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యల పట్ల అవగాహన ఉన్నప్పటికీ ఆర్థిక సమస్యల వల్ల , ఇతర సమస్యల వల్ల ఈ బాల్య వివాహాలు నిర్వహిస్తున్నారని ప్రభుత్వము అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అనేక ప్రోత్సాహకాలను అమలు పరుస్తున్నాయని వాటి వినియోగించుకుని బాలల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. అనంతరం అంగనవాడి టీచర్లతో బాల్యవివాహాలకు నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ట్రైలర్ పి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి




**ఏలూరు,మేజర్ న్యూస్:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్ట్ జిల్లా కార్యాలయంలో సమ్మె సన్నాహక సమావేశం ఇఫ్ట్ జిల్లా ప్రధానకార్య దర్శి బద్దా వెంకటరావు అధ్యక్షతన ఏర్పాటు చేయటం జరిగినది. సమావేశం ఉద్దేశించి ఇఫ్ట్ జిల్లా అధ్యక్షులు కెవి రమణ,ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కొడుల రద్దు కై సాగే నిరంతర పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా కార్మిక వర్గానికి కర్షక వర్గానికి పిలుపునివ్వటం జరిగినది. సమ్మె జయప్రదం కొరకు దశల వారి ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చినారు, బిజెపి కేంద్రంలో రెండో విడత అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంట్లో తనకున్న బలంతో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడును ఆమోదించింది.జిల్లా వ్యాప్తంగా కార్మిక వర్గం రైతాంగం కదం తొక్కి సమ్మెను జయప్రదం చేసేదాంట్లో కృషి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి ఎఐటియుసి నాయకులు భజంత్రీ శ్రీనివాసరావు, ఏ అప్పలరాజు, దొడ్డిగర్ల నాగబాబు,ఇఫ్ట్ నగర అధ్యక్షులు నాయకులు బుద్ధ సోమయ్య, మరియు దానవర ప్రసాదు, నాయకులు నవుడు నెహ్రూ బాబు, చంద్రశేఖర్, రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మహా గజమాలయాత్రలో పాల్గొన్న చైర్మన్ కొల్లు



**అమలాపురం / నరసాపురం, మేజర్ న్యూస్:** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుండి అంతర్వేది మహా గజమాల యాత్ర మహోత్సవం బుధవారం నిర్వహించారు. అంతర్వేది ఉత్సవాలు సందర్భంగా ప్రతి ఏటా జరిగే ఈ కార్యక్రమంలో అంతర్వేది శ్రీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం నిర్మాత భక్త శిఖామణి అగ్నికులక్షత్రియ మహారాజ కొపనాతి కృష్ణమ్మ వర్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్ది రాజు, రోజోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య, అంతర్వేది ఆలయ నిర్మాత కోపనాతి కృష్ణమ్మ ముని మనవడు కోపనాతి శ్రీనివాస్ జిల్లా టీడీపీ ఉప అధ్యక్షులు లంకే శ్రీను, ఇల్లింగి వెంకట రమణ, తిరుమాని ఆచార్య కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాన్ని తొలిసారిగా నిర్మించిన లజపతిరాయ్




**ఏలూరు,మేజర్ న్యూస్:** భారతదేశంలో కార్మిక సంఘాన్ని తొలిసారిగా నిర్మించిన లాలా లజపతిరాయ్ ఉద్యమ స్ఫూర్తిని ఏఐటియుసి కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం నాడు ఆర్ఆర్‌పేట ఎస్ ఆర్ టు ఏఐటీయూసీ స్థూపం వద్ద ఎఐటియుసి వ్యవస్థాపక అధ్యక్షులు లాలా లజపతిరాయ్ 162 వ జయంతి కార్యక్రమాన్ని ఏ ఐటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించగా, లాలా లజపతిరాయ్ చిత్రపటానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు కోశాధికారి బి నారాయణరావు నూలు పోగు దండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బండి వెంకటేశ్వరరావు, అప్పలరాజు, నారాయణ రావు మాట్లాడుతూ లాలా లజపతిరాయ్ దేశ స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో కార్మికుల పక్షాన నాయకత్వం వహించిన మహోన్నత వ్యక్తి అని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఏఐటియుసి నాయకులు నారా శ్రీను, ఎస్ఎంవి సుబ్బారావు,డి వెంకటేశ్వర రావు, సిహెచ్ అప్పారావు,బి అప్పారావు, బత్తుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి : సి.ఐ.విల్సన్,ఎస్.ఐ.ఎం.భాష



**భీమడోలు,మేజర్ న్యూస్:** రోడ్డు నియ మ నిబంధనలను పాటించండి.మీతో పాటు ఇతర వాహ నదారుల రక్షణకు సహకరించండని, సి.ఐ.విల్సన్,ఎస్.ఐ.మదీనా భాష కోరారు.రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం 216–ఎ–జాతీయ రహదారిపై భీమడోలు రైల్వే గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాల తో ప్రయాణిస్తున్న వారిని గుర్తించారు.వారికి జరిమానాలు విధించకుండా,వారితో హెల్మెట్‌లో కొనుగోలు చేయించి ధరింపజేశారు. హెల్మెట్ లేని ప్రయాణాల వల్ల కలిగే ఇబ్బందుల గురించి, వారి కుటుంబ సభ్యుల భద్రత గురించి తెలియజేశారు. సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని వారి కుటుంబ సభ్యులను కోరారు. సెల్ఫోన్ వినియోగిస్తూ ప్రయాణాలు చేయడం మాని వేయాలని హితవు పలికారు.

## మద్దాయి కుంట హైస్కూల్లో లజపతిరాయ్ జయంతి వేడుకలు



**నూజివీడు,మేజర్ న్యూస్ :** మండల ంలోని ముద్దాయి కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు దారుపరెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమరయోధుడు, (పంజాబ్ సింహం) పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాలవేసి బుధవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, భారతదేశ ప్రజలందరినీ ఏకం చేయడం కోసం లాలా లజపతిరాయ్ విశేష కృషి చేశారని అన్నారు.నేటి తరం విద్యార్థులు ఆయన దేశభక్తిని ధైర్యాన్ని త్యాగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమానికి గణిత ఉపాధ్యాయులు పి నాగేంద్రరావు,భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పొలిటి తులసి భాస్కర్లు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లలతో వ్యవహరించే పద్ధతులపై అవగాహన




**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పట్టణ పరిధిలో గల జీవీఎస్వీఆర్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ నందు వార్డు శానిటేషన్ ,పర్యావరణ కార్యదర్శిలు దొరబాబు.చిరంజీవి. విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు గతంలో మాదిరిగా ఒకసారి మాత్రమే పరిమితం కాకుండా నిర్ణీత వ్యవధిలో నిర్వహించాలని అధికారులు తెలిపియున్నారు. బడి బయట పిల్లలతో వ్యవహరించే పద్ధతులు. తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని. ముఖ్యంగా కార్మిక ప్రాంతాలను నివసించే పిల్లలు . ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చెప్పినారు.కుక్కల విషయంలో చేయవలసినవి. చేయకూడనివి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్. సామాజిక వేత్త చిలుకూరి భీమన్న .విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

# అప్పడా రిజిస్ట్రేషన్లు ఈ నెలాఖరుకు నూరు శాతం పూర్తి కావాలి



– ఆక్వాసాగు విస్తీర్ణం ఉన్న మండలాలలో ప్రత్యేక డ్రైవ్

– క్షేత్రస్థాయిలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు

**భీమవరం,మేజర్‌న్యూస్ :** కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అప్పడా రిజిస్ట్రేషన్ల పై మత్స్య శాఖ అధికారులు, ఎఫ్‌డిఓలు, ఎండివోలతో మండలాలు వారిగా గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 1,31,436 ఎకరాలలో ఆక్వాసాగు జరుగుచున్నదని, ఇప్పటివరకు 66,340 ఎకరాల విస్తీర్ణంలో అప్పడా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం జరిగిందని, 39,413 ఎకరాలు అప్పడాలో రిజిస్టర్ కావలసి ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి నూరు శాతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయించాలని మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

వివిధ కారణాల దృష్ట్యా 25,315 ఎకరాల రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదన్నారు. చెరువులు, రొయ్యల సాగురైతులు అందరూవెంటనేఅప్పడాలో రిజిస్ట్రేషన్‌చేయించుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల ద్వారా చట్టబద్ధ అనుమతి, ప్రభుత్వ పథకాలలబ్ధి, వివాదాల నివారణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఎక్కువ ఆక్వా సాగు విస్తీర్ణం ఉన్న ఆకివీడు, భీమవరం,గణపవరం, మొగల్తూరు, నరసాపురం, కాళ్ళ, వీరవాసరం మండలాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రైతులు రిజిస్ట్రేషన్లు చేయించుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను తక్షణ రిజిస్ట్రేషన్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈగూగుల్ మీట్‌లో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్, సహాయ సంచాలకులు ఎల్ఎల్ రాజు,ప్రసాద్,ఎంపీడీవోలు ,ఎఫ్‌డ ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే రోషన్





**అమరావతి/జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** చింతలపూడి నియోజకవర్గం లోని చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కోరారు.బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్‌ను ఎమ్మెల్యే రోషన్ కుమార్ కలిసి మున్సిపాలిటీల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. మున్సిపాలిటీ ఆదాయం పెంపుదల కోసం తీసుకోవాల్సి న చర్యలపై సురేష్ కుమార్ పలు సూచనలు చేశారు. చింతలపూడి నగర పంచాయతీ లో సిబ్బంది కొరతను తీర్చాలని,వార్డు సచివాలయాలను అర్బన్ పరిధిలోనికి తీసుకురావాలని నిధిలాగిన్ సమస్యను పరిష్కరించా లని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా సంబంధించి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే రోషన్ కుమార్ తెలిపారు.

# మారుతున్న పరిస్థితుల కనుగముగా విద్యార్థులు టెక్నాలజీని నేర్చుకోవాలి




– వైఎన్ కళాశాలలో ఒకరోజు వర్క్ షాప్

**నరసాపురం,మేజర్ న్యూస్ :** ఈ కామర్స్ మేనేజ్మెంట్ స్టడీస్ డిపార్ట్ మెంటులు, ఐ.క్యూ. ఏ.సి సంయుక్తంగా ఎంప్లాయిబులిటీ పై ఒకరోజు వర్క్ షాప్‌ను కళాశాల,పి.జి.సెమినార్ హాలు నందు బుధవారం నిర్వహించారు.

ఈ వర్క్ షాపునకు రిసోర్స్ పర్సన్ గా ఫణేష్ ఆత్మూరి, రీజనల్ మేనేజర్ లీడర్ – ఏషియన్ – సౌత్ ఏషియన్ ఫ్యూజి ఫిల్మ్ హెల్త్ కేర్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్,లక్నో వారు పాల్గొన్నారు. ఈ వర్క్ షాపును. కళాశాల ప్రిన్సిపాల్ డాసిహెచ్. కనకారావు ప్రారంభ ఉపన్యాసం చేయగా, పి.జి.ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ఆర్. పార్ధసారధి ఫణేష్ ను పరిచయం చేసి, ఈ వర్కుషాప్ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించినారు.ఫణేష్ ఆత్మూరి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ నేటి ప్రపంచములో మారుతున్న పరిస్థితుల కనుగముగా విద్యార్థులు టెక్నాలజీని నేర్చుకొని నిత్యజీవితమునకు, వృత్తి జీవితమునకు అపాదించుకోవాలని,అలాగే విద్యార్థి నిరంతరం లెర్నర్ గా ఉండాలనీ కోరారు.

విద్యార్థులు తమ స్టడీస్ పూర్తికాగానే మంచి ఉద్యోగాన్ని ఎలా సాధించవచ్చునో కొన్ని స్ట్రాటజీలను వివరించినారు.

ప్రిన్సిపాల్ కనకారావు మాట్లాడుతూ మన కళాశాల లో అనేక సౌకర్యాలు, లైబ్రరీ వంటి మౌళిక సౌకర్యాలు ఎంతగానోను ఉన్నాయి వాటిని సమర్థ వంతంగా ఉపయోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈకార్యక్రమములో ఐక్యూఎసి కోఆర్డినేటర్ డా గంధం శ్రీ రామకృష్ణ, హెచ్.ఆర్.డి. డైరెక్టర్ సిచ్. శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీబి.వి.రత్నం తదితరులు ప్రసంగించగా,ఎ. వి.రమణ.పి.వి.సుబ్బారావు, కె.అమ్మ శ్రీ శ్రీ వై.ప్రభాకరరావు, కె.కల్పన, కుమారి కోటిపల్లి గీత,జి. రంగబాబు,కుమారి ఆర్.వి లక్ష్మి,యూ రాము, పి. సుబ్బారావు,కుమారి మౌనిక, కె.కుమార్,శ్రీనివాస వర్మ తదితరులు పాల్గొన్నారు.

# బార్ లైసెన్సు మంజూరు కొరకు దరఖాస్తుల ఆహ్వానం



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఒక బార్ లైసెన్సుల మంజూరు కోసం జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాంబాబు తెలిపారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం నర్సాపురం మున్సిపాలిటీ లోని దబ్ల్యూజి/బి/10,వరుస సంఖ్యలు గల బార్లకు ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 4 సాయంత్రం 6 గంటలలోపు ఆన్‌లైన్ (https://oc.hpfsproject.com,హైబ్రిడ్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ప్రతి దరఖాస్తుకు తిరిగి చెల్లించబడని అప్లికేషన్ ఫీజు రూ. 5లక్షల ప్రాసెసింగ్ ఫీజు రూ. 10,వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ బార్లకు లైసెన్స్ కాలపరిమితి 05-02-2026 నుండి 31-08-2028 వరకు ఉంటుందన్నారు.రిటైల్ ఎక్సైజ్ పన్ను కింద 2025-26 సంవత్సరానికి రూ. 41లక్షల25వేలు, 2026-27 సంవత్సరానికి రూ. 60లక్షల50వేలు 2027-28 సంవత్సరానికి రూ. 66లక్షల 55వేలు నిర్ణయించడం జరిగింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి 5, 2026 ఉదయం 8 గంటలకు భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం,పిజిఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించబడుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం ఏదైనా బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చిన పక్షంలోనే డ్రా నిర్వహించడం జరుగుతుందని,ఎంపికైన అభ్యర్థి మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్నును ఎంపికైన వెంటనే తప్పనిసరిగా చెల్లించవలసి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ గురించి మరిన్ని వివరాల కోసం నర్సాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలియజేశారు.

## ఉమ్మడి ప.గో.జిల్లా న్యాయ సేవాధికార సంస్థలోని ఉద్యోగాల దరఖాస్తు గడువుపెంపు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థలోని డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 27వ తేదీ నుండి 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పోస్ట్ ద్వారా జిల్లా న్యాయ సేవాధికార ఏలూరు కార్యాలయం చేరే విధంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఆర్టీసీ బస్సులో మంటలు - తప్పిన పెను ప్రమాదం



**జంగారెడ్డి గూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం పెను ప్రమాదం తప్పింది. జంగారెడ్డిగూడెం నుండి ద్వారకాతిరుమల వెళ్ళవలసిన బస్సులో నుండి మంటలు వచ్చి పొగరావడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేశారు.షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు భావించారు.ద్వారకా తిరుమలకు మరో బస్సును ఏర్పాటు చేసి ప్రయాణికులను పంపించారు.

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుచేయాలి






**- ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కేసులు నమోదు**
**- ఫిర్యాదులను 18004256131 ఫోన్ చేయాలి**
**- అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్**

**ఏలూరు,మేజంన్యూస్ :** గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని గౌతమీసమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన పిసి అండ్ పి.ఎన్.డి.టి. యాక్ట్ అమలుపై అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, వాటిని నిరోధించేందుకు మరింత నిఘా పెంచడంతోపాటు, పెద్ద ఎత్తున డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్వహించే తనిఖీలు అర్థవంతంగా ఉండాలన్నారు.తప్పుచేసిన వారికి శిక్ష పడేలా ఉండాలన్నారు. దీనితోపాటు ఇందుకు సంబంధించిన చట్టంపై పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ నుంచి మదర్ అండ్ చైల్డ్ ట్రాకింగ్ వివరాలను కూడా పొందాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దు మండలాల అధికారులతో సబ్ కమిటీ ఏర్పాటుచేసి,ఏ ప్రాంతం నుండి అబార్షన్‌కు సంబంధించి కేసులు నమోదవుతున్నాయో పరిశీలించి ఆయా స్కానింగ్ కేంద్రం వారి వివరాలు సేకరించాలని అన్నారు .ఎక్కడైనా ఆయా కేసుల పై అనుమానం వ్యక్తమైతే అందుకు సంబంధించిన సమాచారం రికార్డు చేసుకోవాలని,18004256131 టోల్ ఫ్రీ ఫోన్ చేసి ప్రజలు ఫిర్యాదు చేసేలా ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు.డెకాయ్ఆపరేషన్స్ నిర్వహించి ఎవరైనా లింగనిర్ధారణపరీక్షలకు పాల్పడినట్లు గుర్తించినట్ల యితే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు .తనిఖీలు నిర్వహించే బృందానికి తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. వాటిల్లో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రుజువైతే వెంటనే సదరు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, డాక్టర్ల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జె.అమృతం, డెమో శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పీడీ శారద, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి చైతన్య,అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యాధికారులు, ప్రభుత్వులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడిన జిల్లా కలెక్టర్

**- పిజిఆర్ఎస్ సమస్యలు మరింత నాణ్యతతో పరిష్కరించాలి**



**భీమవరం,మేజర్ న్యూస్:** ప్రజల స్థానంలో మనమే ఉంటే సమస్యను ఎలా పరిష్కరించుకోవాలని ఆలోచన చేస్తామో అదేరీతిలో పిజిఆర్ఎస్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిజి ఆర్ ఎస్ లో వచ్చిన ఫిర్యాదులపై లబ్దిదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలకు అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. పాలకొల్లు మండలం అరట్లకట్ల గ్రామ నివాసి చోప్పుల లక్ష్మీకాంతం, పెంటపాడు గ్రామం మహమ్మద్ జెరీనా, కవిటం గ్రామం కోట వెంకట గోవింద సత్యనారాయణ,పెనుగొండ గ్రామం సత్తిసీతాదేవి, అత్తిలి గ్రామం కానుమిల్లి విజ్జు కిషోర్‌లతో స్వయంగా ఫోన్ చేసి పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కాలపై అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో అర్జీదారులకు వేగవంతమైన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వారితో మమేకమై వారి సమస్యను పూర్తిగా విని పరిష్కారం చేయాలని సూచించారు.ఈ సందర్భంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి ఉన్నారు.

# విద్యార్థులు పఠనాసక్తిని మరింత పెంపొందించుకోవాలి





**- ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** జ్ఞాన సముపార్జనే లక్ష్యంగా విద్యార్థులు పఠనాసక్తిని మరింత పెంపొందించు కోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. అప్పుడే తాము నిర్దేశించుకున్న ఉన్నతలక్ష్యాలను సునాయాసంగా చేరుకునేందుకు మార్గం సుగమమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డులోని ఆక్స్ ఫర్డ్ స్కూల్లో బుధవారం సైన్స్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో 2025-26 పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని స్ఫూర్తివంతంగా నిర్వహించారు.అనంతరం రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, విద్యార్థులు రూపొందించి, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ నమూనాలను పరిశీలించి వాటి వివరాలను విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ విద్యార్థులను సాంకేతిక మార్గంవైపు ప్రోత్సహించేందుకు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ యాజమాన్యం చేస్తోన్న ప్రయత్నాన్ని ప్రత్యేకంగా అభినందించారు. జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలంటే ప్రతి విద్యార్థీ నిత్యమూ ఏదొక కొత్త విషయాన్ని నేర్చుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థులు ఎంచుకున్న రంగాలను సునాయాసంగా చేరుకోగలుగుతారని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కార్పొరేటర్లు కలవకొల్లు సాంబ,అన్నపనేని రవికుమార్,డివిజన్ ఇంచార్జ్ రెడ్డి రామకృష్ణ, స్కూల్ ప్రిన్సిపల్స్ ఐవి సుధాకర్, ఎమ్. శారద తదితరులు పాల్గొన్నారు.

కాగా ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఏలూరు గంగానమ్మ జాతర మేడల నమూనా విశేషంగా ఆకట్టుకుంది. మేడల వద్ద అమ్మవార్లతో పాటూ పోతురాజు బాబుల వేషధారణలతో విద్యార్థులు ఆశీసులుకాగా మేడల నమూనాను తిలకించిన ఎమ్మెల్యే చంటి, ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# దేవస్థానం అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్**





**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** దేవస్థానం అభివృద్ధికి పాలకమండలి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలం వడాలి (చిన పూరి) గ్రామంలో పెంచేసియున్న శ్రీ సుభద్ర బలరామ సహిత శ్రీ జగన్నాథస్వామివారి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం , అభినందన సభలో పాల్గొన్నారు. చైర్మన్ గా వీరమల్లు రత్నకుమారి , సభ్యులుగా చిలకలపల్లి నాగరాజు ,పరసా గంగాధరరావు , గూడవల్లి పద్మావతి , అనగాని వెంకటనరసమ్మ , రాజుల పాటి వెంకటేశ్వమ్మ ,కటికల నాగ వెంకట కోటేశ్వరరావు,కల్లూరి సుబ్రహ్మణ్యం , గుర్రపు రజిని , నక్క వెంకట నాగలక్ష్మి ,శ్రీనివాసుల వెంకట సత్యనారాయణాచార్యులు లను ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నర్సింహారావు,మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ,కోటప్రోలు కృష్ణారావు,బిజెపి జనసేన మండల పార్టీ అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి , వీరంకి వెంకయ్య , నాయకులు ఏ ఎన్ బాబు , బొంగు రవికుమార్ , దావు నాగరాజు, పోసిన పాండురంగారావు, చలసాని జగన్మోహ న్రావు, యర్ర రాంబాబు, నక్క అప్పారావు, కట్టా కోటయ్య , వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మానవత నెలవారీ సమావేశం



**జంగారెడ్డిగూడెం ,మేజర్ న్యూస్:** మండలంలోని గుర్వాయిగూడెంలో మానవత కమ్యూనిటీ హాలు గుమస్తా లక్ష్మీ మాతృమూర్తి ఎల్లమ్మ మృతికి మండలం మానవత కమిటీ సంతాపం తెలిపింది. మానవత నెల వారి సమావేశంలో బుధవారం ప్రెసిడెంట్ అల్లూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. లక్ష్మీ కుటుంబ సభ్యులను పరామర్శించి,పలువురు ప్రసంగించారు.

# మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మృతి పట్ల అప్పల నాయుడు విచారం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ బారామతి వద్ద జరిగిన విమానం ప్రమాదంలో దుర్మరణం చెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక శకం ముగిసింది.సహకార బ్యాంక్ ఛైర్మన్ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ, దశాబ్దాల పాటు మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకన్నారు.

మహారాష్ట్ర అభివృద్ధికి, ప్రగతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ,అనుచరులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు,ఎన్సీపీ కార్యకర్తలకు ,అభిమానులకు ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఆర్ అండ్ ఆర్ కాలనీకి ప్రత్యేక పంచాయతీ కావాలి



– నిర్వాసితులుగా తీవ్ర అన్యాయానికి గురి అవుతున్నాం

**జంగారెడ్డి గూడెం,మేజర్‌న్యూస్:** జంగారెడ్డి గూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెం గ్రామ పరిధిలో గల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి2022లో వేలేరుపాడు,పోలవరం,కుక్కునూరు మండలాల నుండి దాదాపుగా 800 కుటుంబాలకి పైగా వచ్చారు.మంగళవారం కాలనీ కమిటీ సబ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బద్దె ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ కాలనీకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడిచిన ఇంతవరకు సరైన వసతులు,ఉపాధి లేక నానా ఇబ్బందులు పడుతున్నారని కనీసం ప్రత్యేక పంచాయతీ చేస్తే మంచినీళు ,,వీధి లైట్లు లాంటి చిన్న చిన్న అవసరాలు ఐనా తీర్చుకోగలం అని ఆర్ అండ్ ఆర్ కాలనీ కమిటీ సభ్యులు అన్నారు.

ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోవడం లేదు అని ప్రత్యేక పంచాయతీ చేస్తే ఇక్కడే అన్ని కార్యాలయాలు ఇక్కడికే వస్తాయని కమిటీ సభ్యులు పెరుమాళ్ళ శ్రీను పేర్కొన్నారు.ఈసమావేశంపనితి రమణయ్య, పెరుమాళ్ళ నరసింహారావు,వరక విశ్వనాధం,లక్ష్మణ్, సబ్బీర్ లాలయ్య, నాగరాజు, లాలయ్య, పవన్,హుస్సేన్, బజారు పాల్గొన్నారు.

## నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

**ఏలూరు,మేజర్ న్యూస్ :** కొయ్యలగూడెం మండలంలో పొంగుటూరు,గవరవరం గ్రామాలలో నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన విత్తన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, విత్తన కంపెనీల మోసాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.బుధవారం ఏలూరు అన్నే భవనంలో నకిలీ మొక్కజొన్న విత్తనాలపై వారు మాట్లాడారు. విత్తన కంపెనీలు రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం పట్టించు కోవడంలేదని విమర్శించారు. కంపెనీల ఇష్టా రాజ్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలకు రైతులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్యలగూడెం మండలంలో బేర్ కంపెనీ ఇచ్చిన నకిలీ విత్తనాలు వలన పంట ఎండిపోతోందని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి నష్టపోయారని, పైగా కంపెనీ నష్టపరిహారం ఇవ్వకుండా పెట్టుబడి డబ్బులు తిరిగి వెనక్కి ఇవ్వాలని రైతులను బెదిరించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన చట్టం కంపెనీలకు ప్రయోజనం తప్ప రైతులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదన్నారు. రైతులకు మేలు చేసే విత్తన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## 12న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి



**ఇరగవరం మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12 జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి పిలుపునిచ్చారు. బుధవారం ఇరగవరం మండల కేంద్రంలో సమ్మె గోడ పత్రికలను ప్రదర్శించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగాకామన మునిస్వామి మాట్లాడుతూ లేబర్ కోర్సును రద్దు చేసే వరకు పోరాటం ఆపేదిలేదని అన్నారు. కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలోనికి వచ్చిన నాటి నుండి కార్మికులపై దాడులు పెరిగాయని కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెడుతున్నారని ఆరోపించారు.ఇది కేవలం కార్మిక చట్టాలను నాశనం చేయాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు .ఈ మధ్యకాలంలో ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి రద్దుకి మార్గాలు సుగుణం చేశారని అన్నారు.

దీనికి మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వము మద్దతు తెలియజేయడం విచారణ అన్నారు.ఈ కార్యక్రమాన్ని సిఐటియు నాయకులు జుత్తిగ రామాంజనేయులు, కొప్పిచెట్టి అరుణకుమారి, దంపనబోయిన రామలక్ష్మి పేచ్చేటి నాగేశ్వరరావు కె. నాగభూషణం పిల్లి వెంకటేశ్వరరావు, జక్కం శెట్టి గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ పూర్తిగా నిర్మూలించడానికి కృషి చేయాలి




**ఏలూరు,మేజర్ న్యూస్ :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగముగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రక్త ప్రసాద్ తెలియజేశారు బుధవారం శ్రీరామ్ నగర్ లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఇంకా బాల కార్మిక వ్యవస్థ అక్కడక్కడ జరుగుతుందని,సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొంతమంది స్వార్థపరుల స్వభాలాపేక్షకు పేదరికం అడ్డుగా పెట్టుకొని ఈ దురాచారాన్ని కొనసాగిస్తున్నారని కావున బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి అందరు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.జిల్లా శిశు సంక్షేమ అధికారిని సూర్య చక్రవేణి మాట్లాడుతూ ఇటుకల బట్టీలు, మొక్కజొన్న ఫ్యాక్టరీలు తదితర కర్మాగారాలలో పనిచేసే పేదల కుటుంబ సభ్యులతో పాటు వారి పిల్లలను కూడా పనిలో నియమిస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి పునరావాసం కల్పించి,పాఠశాలలో చేర్పించేలా కృషి చేయడం జరుగుతుందని అందుకు ట్రాన్స్పోర్ట్ సభ్యులందరూ తనిఖీలు నిర్వహిస్తున్నారని సూచించారు ఈ కార్యక్రమంలో దిశ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, ఎ.ఎల్.ఓ. గోపాలకృష్ణ, సి డబ్ల్యూ సి సభ్యులు పి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులుంటే సరి చేయించుకోవాలి



**పాలకోడేరు, మేజర్ న్యూస్,** పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు ఏమైనా ఉంటే పరిశీలించుకుని వాటిని సరి చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామ సచివాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకంలో తప్పులు సరిచేసుకోవడంలో పలు సూచనలను, సలహాలను రైతులకు వివరించారు. ప్రతి రైతు తన హక్కులను కాపాడుకోవడానికి భూ రికార్డులు సరి చూసుకోవడం ఒక కీలక బాధ్యతని అన్నారు. అందుకోసం అధికారులు పూర్తిగా సహకరిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి విస్తీర్ణం, సర్వే నంబర్, ఖాతాదారు పేరు, ఆధార్ నంబర్, పంట వివరాలు, బ్యాంకు ఖాతా వంటి అంశాల్లో చిన్న తప్పులు కూడా రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ ఎన్.విజయలక్ష్మి, డి.టి రఘు, ఆర్.ఐ రాఘవ రాజు, వీఆర్వో కృష్ణంరాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తాడుగాయి మహాశివరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**చింతలపూడి / జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం మండలంలోని తాడువాయిలో ఫిబ్రవరి 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణం మహోత్సవములకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి,స్వామివారిని దర్శంచుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు.తాడువాయిలోని మహాశివరాత్రి ఉత్సవ కమిటీ వారిచే రూపొందించ బడిన ఆహ్వాన శుభ పత్రికను ఎమ్మెల్యే రోషన్ కుమార్ మంగళవారం చింతలపూడి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గత ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చానని తిరిగి అదే విధంగా ఈ ఏడాది కూడా మహాశివరాత్రి ఉత్సవాలకు వస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పునూతల పుల్లారావు, కొడవలి సత్యరాజు,పిన్నమనేని నాని, గ్రామ పార్టీ అధ్యక్షులు కనికళ్ళ శ్రీనివాస్,పొన్నగంటి మహి,పాపోలు శ్రీనివాస్, ఉప్పునూతల వెంకటేశ్వరరావు, ఉప్పునూతల రాఘవేంద్రరావు, శ్రీనివాస్, నడిపూడి శ్రీనివాస్,చిన్ని కృష్ణ,అనపర్తి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### చినవెంకన్న హుండీల ద్వారా రూ.2.24 కోట్లు ఆదాయం





**ద్వారకా తిరుమల,మేజర్ న్యూస్:** ద్వారకా తిరుమల చినవెంకన్నకు హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గడచిన 20.రోజుల కాలానికి గాను స్వామివారికి నగదు రూపంలో 2.24 కోట్ల రూపాయల అధిక ఆదాయం లభించింది.స్థానిక ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో బుధవారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగిన ఈ లెక్కింపులో దేవాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ హుండీల లెక్కింపు లో స్వామివారికి 2,24,23,765 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ వై.భద్రాజి తెలిపారు. అలాగే భక్తుల కానుకలు రూపేణా 174 గ్రాముల బంగారం 3, కేజీల 594 గ్రాముల వెండి లభించినట్లు ఈవో భద్రాజి వివరించారు.అలాగే విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది..

# అబద్ధాలు,మోసాలతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం





– వైఎస్ఆర్సిపి ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రులు,ఎమ్మెల్సీలు,మాజీ ఎమ్మెల్యేలు

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్;** తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి కోర్డినేటర్ వడ్డీ రఘురాం నాయుడు ఆధ్వర్యంలో వైయస్సార్సీపి ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు మాజీమంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంగా రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా,మాజీ ఎంపీ చింతా అనురాధ,పలువురు వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలో వేసి నివాళులర్పించారు. గడిచిన రెండు సంవత్సరాలలో పార్టీ ప్రక్షాళన జరుగుతుందని కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని చూస్తున్నామని,అధికారం లేకపోయినా జగన్మోహన్ రెడ్డి ప్రజల పక్షాన పోరాడుతున్నాడని ముదునూరి ప్రసాదరాజు తెలియజేశారు. నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక అబద్ధాలు మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందని, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణకు అందించిన తోడ్పాటు వడ్డీ రఘురాం నాయుడు కి అందించాలని శ్రేణులను కోరారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే శ్రీధర్ ఒంటరి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడం అత్యంత దారుణమని తిరుపతి లడ్డు వివాదంపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన విషయం గుర్తు చేశారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి కార్యకర్తలపై నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తుందని ఇటువంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు మాట్లాడుతూ కూటమి పాలన రెండు సంవత్సరాలు పూర్తికాక ముందే కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కార్యకర్తలు ఎక్కడ అధైర్యపడవద్దని రానున్న కాలంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రానుందని తెలియజేశారు. నియోజకవర్గ ఇన్చార్జి వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ ఈ సమావేశంతో కూటమి గుండెల్లో గుబులు పుడుతుందన్నారు.పార్టీ జెండా మోసిన ప్రతీ కార్యకర్త నియోజకవర్గం ఇంచార్జ్ అని,రానున్న కాలంలో కొట్టు సత్యనారాయణ సలహాలు తీసుకొని తాడేపల్లిగూడెంలో వైఎస్ఆర్సిపి జెండా ఎగురువేస్తామన్నారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి అభిమానులు కార్యకర్తలు నాయకులు హాజరయ్యారు

# కూటమి ప్రభుత్వంలో మహిళలపై పెరిగిన ఆత్యాచారాలు,హత్యలు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, లైంగిక వేధింపులు,అత్యాచారాలు ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తీవ్రస్థాయికి పెరిగాయని హైకోర్టు న్యాయవాది వైఎస్ఆర్సిపి నాయకురాలు కర్ర జయ సరిత అన్నారు. రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే మహిళా ప్రభుత్వ ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు గురి చేయడం,అధికారం ఉంది కదా అని అడ్డమైన చేష్టలు చేయడం ప్రజలు చూస్తూ ఊరుకోరని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు, అనడానికి జనసేనా పార్టీ ఎంఎల్ఏ ఆరవ శ్రీధర్ కీచక పర్వమే ప్రత్యక్ష సాక్ష్యం ప్రజా ప్రతినిదులే మహిలలు పై అత్యాచారాలకు పాల్పడితే రాష్ట్రాన్ని ఎవరు కాపాడాలని ప్రశ్నిస్తు స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయ సరిత ఆవేదన వ్యక్తం చేశారు,తప్పు చేస్తే తాట తీస్తామని ప్రగల్భాలు పలికిన పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారు,అని ఆమె ప్రశ్నించారు,

# సైబర్ నేరాలు,బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



**కైకలూరు, మేజర్ న్యూస్,** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై ట్రైనీ( ఐపీఎస్) జయ శర్మ కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ ఎస్ఐ వెంకట కుమార్ కైకలూరు విజ్ఞాన్ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు పోక్సో చట్టాలు, డయల్ 112, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు మరియు సోషల్ మీడియా భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయ శర్మ మాట్లాడుతూ పోక్సో చట్టం ప్రాముఖ్యత బాల బాలిక లపై లైంగిక దాడులు, వేధింపులు జరిగినప్పుడు చట్టం వారికి ఎలా రక్షణ కల్పిస్తుంది, తక్షణ సహాయం కోసం ఎవరిని సంప్రదించాలి అనే విషయాలను గురించి వివరించారు.వెంటనే పోలీసులకు లేదా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 సమాచారం ఇవ్వాలని సూచించారు.విద్యార్థులు సోషల్ మీడియాను సమాచార సేకరణకు, జ్ఞానార్జనకు మాత్రమే ఉపయో గించాలని,వ్యక్తిగత ఫోటోలు లేదా వివరాలను పోస్ట్ చేయకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో పోలీస్ సిబ్బంది ,విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# మహా గజమాలకు సంఘీభావ యాత్ర



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** నియోజకవర్గం నుండి ఆరు సంవత్సరాలగా మహా గజమాలకు సంఘీభావంగా యలమంచిలి మండలం నుండి గజమాల యాత్రను ప్రారంభించారు,ఎంతో వైభవంగా ఐక్యతతో వాకలగురువు గ్రామం నుండి దొడ్డిపట్ల నక్కపాలెం గంగడ పాలెం లక్ష్మీ పాలెం ఎలమంచిలి లంక కట్టు కాలవ పెనుమర్రు ఎలమంచిలిలో చించినాడ అన్ని గ్రామాలను కలుపుకుని ఎలమంచిలిలో ఉన్న కోపనాతి కృష్ణమ్మ వర్మ విగ్రహానికి పాలాభిషేకం చేశారు,ఆయన విగ్రహానికి గజమాలు వేసి అంజలి ఘటించారు,అనంతరం అంతర్వేదికి ర్యాలీగా బైకులపై వెళ్లారు,ఈ కార్యక్రమం లో అగ్నికుల క్షత్రియ అధ్యక్షులు గాడి రామకృష్ణ నియోజకవర్గ అధ్యక్షులు లంకె ధర్మరాజు,అగ్నికు క్షత్రియ నాయకులు ఎలమంచిలి సర్పంచ్ బర్రె ప్రసాద్ , చింత ప్రసాద్ , తిరు మాని ఆదికృష్ణ , పెద్దిరాజు, ఏడుకొండలు నాగరాజు , అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పిసింగి ఏసుబాబు, శ్రీను ఇంద్ర కమిటీ సభ్యులు అన్ని గ్రామాల యువత ఐక్యతతో ఈ గజమాల యాత్రను విజయవంతం చేశారు.

# జనసేన ఎమ్మెల్యే కీచక పర్వంపై కఠిన చర్యలు తీసుకోవాలి



**ఏలూరు, మేజర్ న్యూస్:** కూటమి పార్టీ రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధ్యత గల ప్రజా ప్రతినిధి అయ్యుండి సమాజం తలదించుకునే విధంగా మహిళతో ఆయన ప్రవర్తించిన తీరుని, ఖండిస్తూ ఏలూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆదేశానుసారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి,నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల వారి ఆధ్వర్యంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.కార్యక్రమంలో జిల్లా వాలంటరీ విభాగ అధ్యక్షురాలు బోగిశెట్టి పార్వతి, జిల్లా మహిళా కార్యదర్శి అచ్యుత కుమారి,జిల్లా కార్యదర్శి కె.తులసి,మహిళా నాయకురాలు కుమారి,పార్టీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

## పరివర్తన్ బధిరుల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా ఏలూరు నగరం పవర్ పేటలోని శ్రీ మద్దుల వారి సత్రం, దేవదాయ ధర్మదాయ శాఖ సేవా కార్యక్రమంలో బాగంగా బుదవారం ఇ.ఓ ఎస్. నెహ్రు , మద్దుల వెంకట సుబ్బారావు చైర్మాన్, మద్దుల రవీంద్ర ,మద్దుల కేశవ, మద్దుల ప్రసాద్ ,పూళ్ళ గ్రూప్ ఇ.ఓ కే.సోమశేఖర్ గారి ఆధ్వర్యంలో పరివర్తన్ బధిరుల విద్యార్థుల కోసం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన బెడ్ షీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సత్రం చైర్మన్ మద్దుల వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన,ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అండగా నిలవడం తమ బాధ్యతని పేర్కొన్నారు.దేవదాయ శాఖ ,మద్దుల వారి కుటుంబం సంయుక్తంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బధిర విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి సాయం అందించడం అభినందనీయమన్నారు.

# ఎస్‌హెచ్‌జి సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి



**భీమడోలు,మేజర్ న్యూస్:** స్వయం సహాయక సంఘ సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పేదరిక నిర్మూలన సంస్థ కృషి చేస్తుందని, వెలుగు, భీమడోలు ,ఎపిఎం.రత్నకుమారి తెలిపారు . బిడిఎల్ పేర మండల సమైక్య పరిధిలోని సిబ్బంది ,గ్రామ సమాఖ్య అధ్యక్షులకు రెండు రోజులపాటు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం కార్యక్రమాన్ని ఎపిఎం. ప్రారంభించారు. దీనిలో భాగంగా వ్యాపార అంచనాల ప్రదర్శన –ప్రణాళిక – ప్రయోజనాలు గురించి వివరించారు. ఇదే క్రమంలో మండల సమాఖ్య గమ్యం (కల, ఆశయాలు)కు సమాంతరంగా వ్యాపార లక్ష్యాల నిర్ణయం, ఉత్పత్తి,అభివృద్ధి ,ఆదాయం పెంపుపై ప్లానింగ్, పెట్టుబడిని సమర్థవంతంగా వినియోగించుట, వ్యాపార అంచనాల తయారీ, దీర్ఘకాలిక ఆర్థిక మనుగడుల అంచన, మండల సమైక్య పనితీరుపై సమీక్ష, ఈ విషయమై మండల సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సలహాలు సూచనలు తీసుకోవటం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు భీమడోలు కార్యాలయ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు నిర్మల, రేఖ, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి పాల్గొని కార్యక్రమ నిర్వహణలో ఎపిఎం కు సహకరించారు.

# ఉండి బస్టాండ్ ఆధునీకరణ





– సిసి రోడ్డు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ,జిల్లా కలెక్టర్ నాగరాణి

**ఉండి,మేజర్‌న్యూస్:** ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ఉండి బస్సు స్టాండ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు జిల్లా కలెక్టర్ చదలవాడనాగరాణిప్రారంభోత్సవం చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడంతో ఉండి వాసుల చిరకాల స్వప్నం నెరవేరిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు ఈసందర్భంగా రఘురామకృష్ణంరాజు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వర్షం వస్తే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి రావడంతో ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో బస్సు స్టాండ్ ప్రాంగణం మొత్తం సీసీ రహదారి వేయించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రాంగణంలోనే మరుగుదొడ్లను నిర్మించడం జరిగిందని వీటిని ప్రయాణికులుఅందరూసద్వినియోగం చేసుకోవాలన్నారు ప్రధాన పంట కాలువ వెంబడి నిర్మించిన సిసి రహదారిని వారు ప్రారంభించారు అనంతరం ఇటీవల అకాల మరణం చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్ ప్రాంగణంలో నిర్మించిన పార్కును, సిసి రహదారిని వారు ప్రారంభించి మాట్లాడుతూ సాగిరాజు సాంబశివరాజు ఇచ్చిన మాటను ఆయన అల్లుళ్ళు వేగేశ్న మహేష్ వర్మ, నడింపల్లి దిలీప్ వర్మ నెరవేర్చి అన్న క్యాంటీన్ అభివృద్ధికి మూడు లక్షలరూపాయలు నిధులు అందజేయడం అభినందనీయమని కొనియాడారు.ఈసందర్భంగా సాగిరాజు సాంబశివరాజు స్మారక స్థూపాన్ని వారు ప్రారంభించి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు,టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, డి సి చైర్మన్ తోట ఫణి, వైస్ చైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు,ఏఎంసీ చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ చైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వనిమా శ్రీనివాస్, కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లీకేజీని శాశ్వతంగా అరికడతాం



**దెందులూరు,మేజర్ న్యూస్:** యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న దెందులూరు గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లీకేజీని శాశ్వతంగా అరికట్టే పనులు ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేసి రాబోయే వేసవికాలంలో నగర ప్రజలకు మంచినీటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేస్తామని నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు.బుధవారం సాయంత్రం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు పరిశీలించడానికి విచ్చేసిన ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ దెందులూరు సమీపంలో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు గత సంవత్సరం ఏప్రిల్ 26వ తేదీన లీకేజీ ఏర్పడిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాలతో మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు 3 రోజుల్లో తాత్కాలికంగా లీకేజీ అరెస్టేసి గడచిన వేసవికాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా మంచి నీటిని సరఫరా చేశామన్నారు.కోట్లాది రూపాయలు కార్పొరేషన్ నిధులను వెచ్చించి వేసవికాలం సైతం మంచి నీటి కొరత లేకుండా నగర ప్రజలకు మంచి నీటిని అందిస్తున్నామని నీటిని మాత్రం వృధా చేయవద్దని ప్రజలను పదేపదే కోరుతున్నామని ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎం.ఈడి.సురేంద్రబాబు,మున్సిపల్ ఎలక్ట్రికల్ డి.ఈ నారాయణరావు, ఏఈలు సాయి,పవన్.కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు,పాము సామ్యూల్ తదితరులు ఉన్నారు.

# ఎస్ఎస్‌సి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి

– విద్యా శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో ఎస్ఎస్ సి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యా శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి ఎస్ఎస్ సి పరీక్షల సన్నద్ధత, 100 రోజుల ప్రణాళికలపై ఉపాధ్యాయులు, బుధవారం ఎం ఈ ఓలు, విద్యా శాఖాధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎస్ఎస్ సి పరీక్షలలో జిల్లా నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లాలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని,ఉపాధ్యాయులు ఆ దిశగా కృషి చేయాలన్నారు.

100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఇంతవరకు 56 రోజులు పూర్తి అయిందని, తరగతుల వారీగా విద్యార్థుల విద్యా సామర్థ్య స్థాయిలు తెలుసుకుని, విద్యార్థులు ఏ సబ్జెక్టు లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని ఆయా సబ్జెక్టుల బోధనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి మిగిలిన 46 రోజులు విద్యార్థులు కష్టపడి విద్యాభ్యాసం చేసేలా పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. విద్య ప్రాధాన్యత పట్ల, విద్యా ద్వారా ఉన్నతస్థాయికి ఏ రకంగా చేరుకోవచ్చో అనే అంశాలపై విద్యార్థులలో ప్రేరణ కలిగిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. నూరు శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన పాఠశాలలను సత్కరిస్తామన్నారు. పరీక్షలకు సన్నద్ధ సమయంలో విద్యార్థినీ, విద్యార్థులలో ఎటువంటి ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు చూడాలన్నారు. డీ ఈ ఓ వెంకటలక్ష్మమ్మ, ఎంఈ ఓ లు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ సభ్యులకు బీమా పాలసీలు చేయించిన జనసేన నేత నవీన్



**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** టి.నర్సాపురం ప్రెస్ క్లబ్ సభ్యులకు జనసేన నాయకులు సి.హెచ్. నవీన్ ఒక్కొక్కరికి రూ. 15 లక్షల ప్రమాద బీమా పాలసీ చేయించి పాత్రికేయుల పట్ల ఆయనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. 20 మంది సభ్యులకు నవీన్ సొంత నిధులతో పోస్టాఫీస్ పాలసీని చేయించారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా సమాజాభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్న పాత్రికేయ మిత్రులకు తన వంతు కర్తవ్యంగా ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకొని,నా సొంత ఖర్చుతో బీమా పాలసీలు చేయించానని తెలిపారు.పాత్రికేయులు కూడా ప్రజా ప్రతినిధులు,ప్రజా నాయకులు, అధికారులతో పాటు సమానంగా ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని, అటు వంటి వారి భద్రత కూడా చూడడం అందరి కర్తవ్యం అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా టీ. నర్సాపురం మండల అభివృద్ధికి నిస్వార్థంగా శ్రమిస్తున్న జర్నలిస్టులందరికీ ప్రమాద బీమాసౌకర్యం ఏర్పాటు చేసినందుకు సంతోషిస్తున్నానని నవీన్ వెల్లడించారు.

## చింతలపూడి లిఫ్ట్ త్వరితగతిన పూర్తి చెయ్యండి

– మంత్రి నిమ్మలకు మాజీ ఎమ్మెల్యే గంటా,రాష్ట్ర అధికార ప్రతినిధి దా.శేషు వినతి



**అమరావతి / జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మెట్ట ప్రాంత రైతులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మీ నాయకత్వంలోనే త్వరితగతిన పూర్తి చేసి తద్వారా మెట్ట ప్రాంత రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామా నాయుడును అమరావతిలో ఆయన ఛాంబర్‌లో కలిసి విన్నవించిన మాజీ ఎమ్మెల్యే గంట మురళి రామకృష్ణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు.

ఈసందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్ట్ పై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని ఖచ్చితంగా వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని అన్నారని మురళి తెలిపారు.వినతిపత్రం ఇచ్చినవారిలో జంగారెడ్డిగూడెం బిసి నాయకులు రాజాన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# గ్రూప్ - 2లో బాదంపూడికి చెందిన ఇద్దరు ఎంపిక





**ఉంగుటూరు,మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు గ్రూప్ –2 పరీక్షలు లో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉద్యోగులకు ఎంపికయ్యారు. గజ్జవరపు శ్వేత గ్రూప్ –2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి డిప్యూటీ తాహసిల్దార్ ఎంపికయ్యారు.

అలాగే ఆలపాటి శ్రీవల్లి కూడా గ్రూప్ –2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఏఎస్ఓ జీఏ డీ గా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు గ్రూప్ –2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం పట్ల వారిద్దరని గ్రామస్తులు ప్రజాప్రతినిధులు అధికారులు అభినందించారు.